RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY   తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 69 ISSUE NO : 69 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం,ఆగస్టు,31,2025 Sunday, August,31, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## బుల్లెట్ రైల్లో జపాన్ ప్రధానితో మోదీ

- జపాన్‌లో ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటన
- ఏఐ, సెమీకండక్టర్లపై ప్రధానంగా చర్చలు
- జపాన్ పర్యటన ముగియగానే చైనాకు పయనం

ఢిల్లీ,:ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి బుల్లెట్ రైలులో ప్రయాణించారు. టోక్యో నుంచి సెందాయ్ నగరానికి వారు ఈ హై-స్పీడ్ రైలులో పయనించారు. ఈ ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెండు రోజుల పర్యటన కోసం జపాన్ వెళ్లిన ప్రధాని మోదీ, భారత్-జపాన్ 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్ల తయారీ, వాణిజ్య పెట్టుబడులే ప్రధాన అజెండాగా ఆయన పర్యటన కొనసాగుతోంది.




## మాగంటి, మాగంలకు సంతాపం..

### ఉభయ సభలు సోమవారానికి

# వాయిదా

- దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం
- మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్ అంటూ రేవంత్ నివాళి
- మండలిలో దివంతగత సభ్యులకు సంతాప తీర్మానం

హైదరాబాద్,తెలంగాణ దిశ: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమ య్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై- శాసనమండలి సభ్యులను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన మండలి మాజీ సభ్యులకు సభ నివాళి అర్పించిన అనంతరం సోమవారానికి వాయిదా పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది. గోపీనాథ్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగ, ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు.





## ట్రంప్ సుంకాలు

# చట్టవిరుద్ధం

### అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పునిచ్చింది. టారిఫ్‌లను విధించేందుకు అధ్యక్షుడికి విస్తత అధికారాలు లేవని స్పష్టంచేస్తూ, ఓ ఫెడరల్‌అప్పీల్స్ కోర్టు సంచలన వాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయమని, దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు.



## మాతరుతున్న అంతర్జాతీయ

# సమీకరణాలు

### మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

### శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరన్న రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : ట్రంప్ సుంకాల బాదుడు వేళ అంతర్జాతీయ సమీకరణాలు మాతరుతు న్నాయి. మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరని రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరిం చుకున్నారు. ఆయా దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం.. శత్రుత్వం అం టూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేవలం ఏదేశానికి తగ్గట్లుగా ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్ష ణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి–ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించా రు. ప్రపంచం వేగంగా మారుతోం ది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈనేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా.. ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం అన్నారు. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదని కూడా వెల్లడించారు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడటం సరైన ఎం పిక కాదని స్పష్టమవుతోందని అన్నా రు. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగు మతుల విలువ రూ.700 కోట్లు ఇ ప్పుడది రూ.24వేల కోట్లకు చేరిం ది. ఈ గణాంకాలు చూస్తుంటే..



## మాగంటి గోపీనాథ్ ప్రజల మనిషి

### ఆయన కుటుంబానికి అండగా ఉంటాం - సంతాప చర్చలో కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,తెలంగాణ దిశ : జీవించినంత కాలం మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్, డైనమిక్ లీడర్‌గా పని చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. శాసనసభలో మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంతకాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. గుమ్మనంగా ఉంటూ తన వ్యక్తిగతమైన ఆరోగ్య విషయాలను చాలా రహస్యంగా ఉంచారు. కానీ పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా.



## చైనా చేరుకున్న

# ప్రధాని మోదీ..

### ఏడేళ్ల తర్వాత తొలిసారి

చైనా : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చైనా చేరుకున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత బీజింగ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా టియాంజిన్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రధానికి రెడ్‌కార్పెట్ వేసి అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.



# నిమజ్జన సందడి

### ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

హైదరాబాద్,తెలంగాణ దిశ : హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు ప్రారంభం అయ్యాయి. ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనా లు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాలు సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాం తాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంట ల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు- చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడి యం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన ఊరేగింపునకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, కోడ్ స్కిక్కర్లతో పర్యవేక్షిస్తున్నారు.




## గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్

# నిరసన

### ఎరువుల కొరతపై విమర్శలు

- పిసి ఘోష్ కాదు..సిసిసి ఘోష్ అంటూ ఎద్దేవా
- కాళేశ్వరం మొదలు అన్ని అంశాలపైచర్చకు సిద్ధం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,తెలంగాణ దిశ : శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమ య్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన చేపట్టింది. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పిం చి అసెంబ్లీకి వచ్చారు. అమరుల స్థూపం వద్ద కాసేపునిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజుల పాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహిం చాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నాగారం యన్నంపేట్ రోడ్డు విస్తరణ పనులను ముమ్మరం చేయాలి



**నాగారం, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :నాగారం%-%యన్నంపేట్ రోడ్డు విస్తరణ పనులను ముమ్మరం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ, హెచ్ఆర్డీసీఎల్‌కి చెందిన ఉన్నతాధికారులు శనివారం కాంట్రాక్టర్ ను ఆదేశించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్, బిజెపి నాయకులు కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ లు రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని ఎంఏయుడి సెక్రెటరీ ఇలంబర్తికి వివరించారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు దీంతో ఇలంబర్తి ఆదేశాల మేరకు ఎంఏయుడి, హెచ్ఆర్డీసీఎల్ అధికారులు రోడ్డు పనులను సందర్శించారు. చీఫ్ సెక్రటరీ ఇలంబర్తి సూచనల మేరకు ఇంజినీర్- ఇన్- చీఫ్‌ను రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించి వివరమైన నివేదిక సమర్పించాలనే ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు నిర్మాణ పురోగతి, ప్రమాద గ్రస్త ప్రాంతాల్లో భద్రతా చర్యలు, ఆలస్యం జరిగిన కారణాలను పరిశీలించారు. ఆలస్యమైన పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందు కోసం అదనపు మానవ వనరులు, యంత్రాంగాన్ని సమకూర్చాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు పనులు పూర్తియ్యే వరకు ప్రమాదాల నివారణకు తక్షణ భద్రతా ఏర్పాట్లు చేపడతామని కూడా



వారు హామీ ఇచ్చారు. పనుల వేగవంతీకరణ కోసం దీర్ఘకాలంగా కృషి చేస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ అధికారుల తనిఖీ ద్వారా ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుందన్నారు. రోడ్డు పనుల జాప్యం వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డును సందర్శించి పనులను వేగవంతం చేసేందుకు ఆదేశాలు జారీ చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ వి నగర్ లో ఘనంగా గణనాధుని పూజలు



**నాగారం, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :గణనాధుని పూజా వేడుకలను పురస్కరించుకొని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఎస్ వి నగర్ కాలనీ లోని శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి స్వామి వారిని నాగారం మున్సిపాలిటీ కమీషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కమిషనర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ సంతోష్, కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రవీందర్ రావు, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఐక్యత, సామరస్యానికి వినాయక చవితి ఉత్సవాలు దోహదం

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**- కాప్రా ప్రెస్ క్లబ్ వినాయక మండపంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**



**ఏఎస్ రావునగర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :కాప్రా ప్రెస్ క్లబ్ వినాయక మండపంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డిలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులు అందరికీ కలగాలని కోరారు. ఈ సందర్భంగా విలేకరులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయన్నారు. గణనాథుడు విద్య, విజయాలకు ప్రతీకని, ఇలాంటి వేడుకలు జరపడం ద్వారా సమాజంలో సత్సంకల్పాలు పెరుగుతాయన్నారు. జర్నలిస్టులు సమాజానికి అద్దం లాంటి వారని, ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తూ ముందుకు సాగుతున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి ప్రెస్ క్లబ్ సభ్యులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, పటేల్ నర్సింహులు, ముత్యం ముఖేష్ గౌడ్, రామచంద్ర మూర్తి, డి. శ్రీనివాసరావు, గంగి కృష్ణ, ఓ. నర్సింహా, శ్రీనివాస్ రెడ్డి, నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ లో ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించాలి

**- కొల్లాపూర్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**- కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు**



**నాగర్ కర్నూల్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంతోపాటు కొల్లాపూర్ లో జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ తోపాటు నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ కోసం స్థలం కేటాయించాలని అంత వరకు ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న భవనాలను కేటాయించాలని వారు కలెక్టర్ ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్రెస్ క్లబ్ అంశంపై చర్చించి పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్. రామచంద్ర, కొల్లాపూర్ నియోజక వర్గం అధ్యక్షులు జలకం మద్దిలేటి, కార్యదర్శి కురుమయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి బాదం పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ సమస్యలు పరిష్కరిస్తా : ఎంపీ ఈటెల



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంపీ మౌలిక వసతుల విషయమై ఆరా తీశారు. విద్యార్థులు ఎక్కువ మొత్తంలో ఈ స్కూల్ లో చదువుతున్నందు వల్ల ఇప్పుడు ఉన్న తరగతి గదులు సరిపోవడం లేదని, బాలికలకు మూత్రశాలలు లేనందున ఇబ్బందులు అవుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపీకి వివరించారు. దీంతో ఎంపీ తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామకృష్ణ, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఈస్ మల్లారెడ్డి, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, బిజెపి సీనియర్ నాయకుడు శేఖర్ యాదవ్, సుబ్బారావు, రచ్చ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన టీచర్ రమాదేవికి ఘనంగా సన్మానం




**కొల్లాపూర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :కొల్లాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జి. రమాదేవి ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్)ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జి రమాదేవిని తోటి ఉపాధ్యాయ బృందంతో పాటు కుటుంబ సభ్యులు విద్యార్థినీలు ఆట పాటలతో అలరించారు. విధినిర్వహణలో అంకితభావంతో ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. భవిష్యత్తులో సామాజిక సేవకు అంకితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్. రామచంద్రయ్య, కొల్లాపూర్ తాలూకా అధ్యక్షులు జలకం మద్దిలేటి, కార్యదర్శి బచ్చలకూర కురుమయ్య, ఉపాధ్యక్షులు ఎస్ పి మల్లికార్జున సాగర్, కారంగి గోవింద్, గోపీనాథ్, రామకృష్ణ, సిపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'రేషన్ కార్డు'దారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలి



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :రేషన్ కార్డు దారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వేలిముద్రల సహాయంతో 100 శాతం ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మొత్తం 537810 కార్డులలోని 1865353 మంది లబ్దిదారులకు గాను 1319111 (70.72 శాతం) లబ్దిదారులు మాత్రమే ఈ కేవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన 546242 (29.28 శాతం) లబ్దిదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవలసి ఉందన్నారు. జిల్లాలోని మిగిలిన 546242 'రేషన్‌కార్డు' లబ్దిదారులు 5 సంవత్సరాల వయసు పూర్తి చేసుకున్నవారు సెప్టెంబర్ నెల రేషన్ పొందుటకు వెంటనే (సెప్టెంబర్ నెలలో) వారియొక్క నివాస ప్రాంతంలో అందుబాటులో వున్న రేషన్ షాపులకు వెళ్ళి తమ యొక్క ఈ కేవైసీ తప్పక పూర్తి చేసుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరాల వయసు పూర్తి కాని పిల్లలకు ఈ కేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. రేషన్ షాపు డీలర్లు కూడా వారి యొక్క రేషన్ షాపులను తెరిచి ఉంచి ఈ కేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

# నిజాంపేట్ లో గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు








**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ పరిధిలోని ఏర్పాటు చేసిన పలు గణనాథులను శనివారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంతరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ ఎన్ఎంసి అధ్యక్షురాలు ఇందిరా కడియాల, ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పలు కమిటీ వాసులు పాల్గొన్నారు.


# సీఎం సహాయ నిధి ద్వారా రూ. ఏడు లక్షల విలువగల చెక్కుల పంపిణీ



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని బి ఆర్ ఎస్ నేతలు కోరారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు ధనలక్ష్మికి రూ. 2 లక్షలు, కృష్ణ బిట్టుకు రూ. 1 లక్ష, భాగ్యలక్ష్మికి రూ. 2 లక్షలు, అఫ్రీన్ బేగంకు రూ. 2 లక్షలను ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మంజూరు చేయించి చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అంద జేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు సుధాకర్, గుబ్బల లక్ష్మీనారాయణ, మెట్ల శీను, జల్దా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్, శ్రీనివాస్, విత్తనాల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ రావునగర్ లో ఘనంగా గణనాధుల పూజా కార్యక్రమాలు





**ఏఎస్ రావునగర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ)** :డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘాలు, వినాయక విగ్రహాలను ప్రతిష్టించిన యువజన సంక్షేమ సంఘాలు ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఆయా మంటపాల ఆధ్వర్యంలో చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సీనియర్ నాయకులు బండారి నీలం రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమార స్వామి, షేక్ అబ్దుల్ రహీమ్, భాగ్యనగర్ ఉత్సవ సమితి ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు నీరుగొండ సతీష్ బాబు, కాసం వెంకట హరి, పి సురేందర్ రావు, కందుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# సంపాదకీయం

## జీవన ప్రమాణాల సంగతేంటీ..?

భారతదేశం 4ట్రిలియన్ల డాలర్ల జిడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయ మని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీ లిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళ్లు వెల్లడవుతాయి. ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జిడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జిడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జిడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలుసగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారుఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి.ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనంతోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ సవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనదిఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు, తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820 లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తినితగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జిడిపి పరిమాణం మాత్రమే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి.దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా..? విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అస మానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారత దేశ ఆర్థిక మైలు రాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం,మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి...!

# భూల్ యూత్ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలి

### - మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్



**కాప్రా, ఆగస్టు 30, (తెలంగాణ దిశ) :**సాయిబాబానగర్ భూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ సాయి బాబా నగర్ భూల్ అసోసియేషన్ సభ్యులు సామాజిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తి శ్రద్ధలతో డివిజన్ ప్రజలు వినాయక పండుగ జరుపుకోవాలని తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ పుణ్య కార్యక్రమంలో సేవ చేసే అవకాశం కల్పించిన సాయి బాబా నగర్ భూల్ యూత్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. కుల మతాలకతీతంగా ఐకమత్యంగా సామజిక సేవా కార్యక్రమాలలో యూత్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొంటారని, వారి సేవలు మరింత విస్తరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పూర్ణయాదవ్, కాప్రా డివిజన్ మైనారిటీ నాయకుడు ముర్తజా, రియాజ్,



ఎం. ప్రదీప్, రాజేందర్ సింగ్, సర్జన్ భుల్, జితాధేర్ సింగ్, కిరణ్ సింగ్, రాజేష్ సింగ్, భరత్ సింగ్, సురేష్ సింగ్, రతన్ సింగ్, పవన్ సింగ్‌హరాసర్కి, మధు కుమార్, ప్రకాష్ సింగ్, రాహుల్ సింగ్, రూపేష్ సింగ్, కార్తీక్ సింగ్, రితిక్ భుల్, లోకేష్ సింగ్, జాన్సన్, సంతోష్ భూల్, రాజేష్ సింగ్, చేతన్ సింగ్, మనీష్ సింగ్, పృధ్వీరాజ్, దేవాన్ష్, దినేష్ శివం, సాధమ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని సస్పెండ్ చేయాలి : బిజెపి







**ఏఎస్ రావునగర్, ఆగస్టు 30, (తెలంగాణ దిశ) :**బిజెపి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏఎస్ రావునగర్ డివిజన్ లోని సీనియర్ నాయకుడు మర్రి మోహన్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు కన్నెబోయిన రమేష్ యాదవ్ లను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బిజెపి డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షురాలు శ్రీమతి తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి కోరారు.

ఈ మేరకు శనివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు, ఎంపీ ఈటెల రాజేందర్ లను వారి వారి నివాసాలలో పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు, క్రమశిక్షణ ఉల్లంఘన విషయమై వారి ఇరువురుపై ఫిర్యాదు చేసారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం, జిల్లా కార్యవర్గ సభ్యులు జివిఎన్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు కొలుకులూరి ఉమా శ్రీధర్, సిద్దూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నిగ్రహం కోల్పోతున్న నేతలు?

రాజకీయాల్లో విమర్శలు సహజమే. కానీ దానికోసం ఉపయోగిస్తున్న భాషే జుగుప్స కలిగిస్తోంది. నేతలు హుందాగా మాట్లాడాలి. హుందాగా వ్యవహరించాలి. మాటతీరు మనిషి హుందాతనం పెంచుతుంది. అవతలి వ్యక్తిపైఎంతటి కసి ఉన్నా, వ్యతిరేకత ఉన్నా భాషతో జాగ్రత్తా ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తు న్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అనుకుంటే..నిత్య జీవితంలో కూడా పత్రికల్లో వాడని భాషను వాడుతున్నారు. ఇష్టానుసారం మాటలు తూలుతు న్నారు. అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో అ డ్డమైనతిట్లు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగతవాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా.. ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుష పదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. భాష విషయంలో ఈ మధ్య కెటిఆర్, జగన్ పోటీపడి విమర్శలు చేస్తున్నారు. పలు సందర్భాల్లో సిఎం రేవంత్ రెడ్డి కూడా కట్టుతప్పుతున్నారు. సిఎంగా ఆయనకు ఇది ఉచితం కాదు.

మంత్రిగా, సిఎంగా చేసిన కెటిఆర్, జగన్‌లకుకూడా ఇది సరికాదు. మహిళానేత రోజా కూడా ఇలాగే మాట్లాడుతుంటారు. తాము పదవుల్లో ఉన్నాలేకున్నా జ్ఞానం లేకుండా మాట్లాడరాదు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. తెలంగాణ ఎన్నో సమస్య లను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు.వాటిపైన దృష్టిని కాస్త ఇప్పుడు విమర్శల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. రాజకీయ నాయకులు భాష వాడేప్పుడు నోరుజారరాదని మాజీ ఉపరాష్ట్రపతి వెక్కయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తున్నారు. ఆయన మాటలు మననంలోకి తీసుకోవాలి. రాజకీయాల్లో బజారు భాష రాకుండా చూస్తే మంచిది.

# మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై అవగాహన


పెద్దపల్లి: రామగుండం సిపి ఆదేశాల మేరకు పట్టణంలోని హనుమాన్ నగర్ లో గల కాకతీయ హై స్కూల్ విద్యార్థులకు షీ టీం సభ్యులు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా షటీం సభ్యులు మౌనిక మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని తెలిపారు. వాటి నుంచి ఎలా బయటపడాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా పని చేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923 700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు స్నేహలత, సురేష్ మరియు ,హెడ్ మాస్టర్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంథనిలో వంద సంవత్సరాల చరిత్ర గల శ్రీ దత్తాత్రేయ దేవాలయం

### ప్రతిరోజు నియమ నిష్ఠలతో పూజలందుకుంటున్న స్వామివారు..



మంథని: వేద గడ్డగా మంత్రపురిగా పేరుగాంచిన మంథని పట్టణంలో 100 సంవత్సరాల క్రితం శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం నిర్మించారు. ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని ప్రస్తుత ఆలయ ప్రధాన అర్చకులు వేదమూర్తులు కొల్లారపు వెంకటరాజం వివరించారు. వంద సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్ర మైసూరు నుండి దోమల రాధమ్మ ఈ ప్రాంతానికి వచ్చి మహాయోగిని గా ఎందరో శిష్యులతో మంథనిలో యోగాభ్యాసం చేయించేవారు. నిజాం పరిపాలన కాలంలో గద్వాల్ సంస్థానం మంత్రి కిషన్ ప్రసాద్ వద్ద రాధమ్మకు ఎంతో పలుకుబడి ఉండేది. ఈమెను గురువుగా భావించిన కిషన్ ప్రసాద్ ఆమెకు కొంత పైకం ఇవ్వడం జరిగింది. ఆ డబ్బులతో ఆమె మంథని పట్టణంలోని తమ్మి చెరువు కట్ట వీధిలో గల ఆమె స్వస్థలంలో యోగి రాజైన శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం నిర్మించడం అయినది. అప్పట్లో ఆమె శాస్త్రోత్తంగా ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఆనాటి నుండి ఆమె వంశస్థులు కొల్లారపు లక్ష్మయ్య, కొల్లారపు గౌతమయ్య సుబ్బలక్ష్మి దంపతులు, ప్రస్తుతం నాలుగోతరమైన కొల్లారపు వెంకటరాజం లలిత దంపతులు నియమ నిష్ఠలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాధమ్మ శిష్యులు శ్రీ దత్తాత్రేయ స్వామి జన్మదినం రోజు అయిన మార్గశిర పున్నమ నుండి తొమ్మిది రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అప్పటినుండి అదే పరంపరగా ఈ ఆలయంలో శ్రీ దత్తాత్రేయ స్వామి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఆలయమును శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి శిష్యులైన ఉత్తర పీఠాధిపతి విజయానంద సరస్వతి స్వామి సందర్శించారు. ఈ ఆలయములోని స్వామివారిని స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు, ప్రస్తుత రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు వారి కుటుంబ సభ్యులు దర్శించుకుంటుంటారు. అలాగే ఈ ఆలయ అభివృద్ధిలో స్వర్గీయ ముద్దు ప్రకాష్ పాలుపంచుకున్నారు.ఈ ఆలయంలో శ్రీ దత్తాత్రేయ స్వామి నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహిస్తారు. మంథని పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. శ్రీ దత్తాత్రేయ నవరాత్రుల తొలి రోజు ఉదయం స్వామివారికి గోదావరి జలంతో అభిషేకం నిర్వహించిన అనంతరం నూతన వస్త్రాలతో అలంకరిస్తారు. నవరాత్రి ఉత్సవం ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే నవరాత్రుల చివరి రోజున అనఘాదేవి వ్రతాన్ని నిర్వహించి హోమగుండము ఏర్పాటు చేస్తారు.



# అంగన్వాడిల్లో అన్ని సేవలు

**కరీంనగర్,తెలంగాణ దిశ :** చిన్నారుల కోసం అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు అన్ని సేవలు అందిస్తున్నామని, తల్లిదండ్రులు అంగ న్వాడీ కేంద్రాలను సందర్శించి ఇక్కడ సేవలు పరిశీలించి తమ పిల్లల్ని చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీం నగర్ రూరల్ మండలం దుర్శేడ్ లోని మండల పరిషత్ ప్రాథమి క పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య మాత్రమే కాకుండా పిల్లల సంపూర్ణ ఆరోగ్యం పై దృష్టి ఉంటుందని తెలిపారు. అంగన్వా డి, ఆరోగ్యశాఖ సమన్వయంతో పిల్లల బరువు, ఎత్తు, లోప పోషణ వంటివి తరచుగా పరిశీలిస్తారని తెలిపారు. దీనివల్ల పిల్లల్లో ఏమైనా లోపాలు ఉన్నా, ఎదుగుదలలో తేడాలు గమనించిన ముందే అప్రమ త్తం చేస్తారని అన్నారు. ప్రతి పిల్లవాడికి రికార్డు నమోదు చేస్తారని తెలిపారు. రిఫర్ చేస్తారని తెలిపారు. పుట్టిన పిల్లల నుండి ఆరు సంవత్స రాల వరకు వయసును బట్టి వారి ప్రవర్తన, ఎదుగుదలలో మార్పులు ఉండాలని, వాటిని అంగన్వాడీ ఆరోగ్య సిబ్బంది గమని స్తారని, తద్వారాశిశువు ఆరోగ్యాన్ని అంచనా వేస్తారని తెలిపారు.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ దయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ - టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ దయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!. %శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20-30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి.

ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అందానికి ఆహారం



వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్‌నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే




ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ఱ%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి.

ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను

.అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?





ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది.

దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది. మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు.

## అనేక వ్యాధులు నయమవుతాయి..!

దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

దయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక దయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో దయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

# సోప్ నెయిల్స్ చూశారా?!



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

# 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

# మానవ అక్రమ రవాణా పై అవగాహన కలిగి ఉండాలి

## -ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ మాథ్యూ






**మంథని,తెలంగాణ దిశ :** మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా నేషనల్ ట్రైనింగ్ అండ్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ మాథ్యూ అన్నారు. అమ్మ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మంథని పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ గురుకుల బాలుర కళాశాల, కృష్ణవేణి హై స్కూల్‌లలోమానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతిరోజు3,560 మంది అక్రమరవాణాకు గురవుతున్నారని, పిల్లలు పెద్దలు మహిళలు తేడా లేకుండా మానవ అక్రమ రవాణా అన్ని ప్రాంతాల్లో జరుగు తుందని విద్యార్థిదశ నుండే మానవ అక్రమ రవాణాపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ లైన్1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181,పోలీస్ 100 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా నేషనల్ కోఆర్డినేటర్ సుహాసిని, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ అమ్మ ఆనంద్ కుమార్,అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడుఅంకరి కుమార్, ప్రధాన కార్యదర్శి జాన్ తిమోతి నాయకర్, గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ వైస్ ప్రిన్సిపాల్ నవీన్,జూనియర్ వైస్ ప్రిన్సిపాల్‌రవి, ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, కృష్ణవేణి హై స్కూల్ కరస్పాండెంట్ జాఫర్, లెక్చరర్లు బోధన సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల భద్రత ప్రభుత్వాల బాధ్యత

## -సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలి
## -తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగమొల్ల దర్శన్ గౌడ్




**మంథని,తెలంగాణ దిశ:** ఉద్యోగుల భద్రత ప్రతి ప్రభుత్వాల బాధ్యత అని, ఉద్యో గులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగమొల్ల దర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు.ఉద్యోగుల భద్రత ప్రతి ప్రభుత్వాల బాధ్యత అని,ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమా ండ్‌తో చేపట్టిన ఉద్యోగుల ఆత్మ గౌరవసభ గోడపత్రిక ను మంథనిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవం తంచేయాలన్నారు.ఆగస్టు 19 నుంచి 31వరకు చేపట్టిన 33 జిల్లాల్లో సిపిఎస్ ఉద్యోగుల ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథనిలో మన ప్రభుత్వ ఉద్యోగులు కలిసి సభ విజయవంతం గురించి చర్చించారు. జీవితాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేస్తున్న ఉద్యోగులు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యం లేక ఆర్థిక అనారోగ్య కారణాలతో మానసిక ఆందోళన చెందుతున్నారని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఆర్థిక భద్రత కల్పించి ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులు ఆత్మ గౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యం అని ఉద్యోగులు విశ్లేషిస్తున్నారు,గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మేము అధికారంలోకి వస్తే సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారని మన తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈకార్యక్రమంలో రాష్ట్రకోశాధికారి మారం లింగారెడ్డి,అధ్యక్షులు మారే పల్లి నాగరాజు,ప్రధాన కార్యదర్శి ప్రకాష్,టిజిఆర్ఎస్ఏజిల్లా అధ్యక్షులు రాముడు,రాష్ట్ర నాయకులు లింగం శ్రీనివాస్, విజయ్ కుమార్, కిరణ్ కుమార్, కేశవ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ముందు చూపుతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

## -సస్యశ్యామలమైన తెలంగాణను కరువు ప్రాంతంగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
## -తప్పుడు ఆరోపణ లపై కోర్టును ఆశ్రయిస్తాం
## -బీఆర్ఎస్ నాయకులు




**మంథని,తెలంగాణ దిశ:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపు తోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని.. బీఆర్ఎస్ సర్కారుహయాంలో సాగు నీటి కష్టాలంటే ఏంటో రైతులకు తెలియ కుండా చేశారని.. కేసీఆర్‌ను బదునాం చేసేందుకు స్వార్థ రాజకీయా లతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంథనిలోని రాజగృహలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడు తూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సుపరి పాలన అందించారన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో 10 ఏళ్లపాటు రైతులను సాగు నీటి కష్టాలు, విద్యుత్ సమస్యలు లేకుం డా చేశారన్నారు. చెరువులు, కుంటల నిండా నీళ్లు ఉంచి ఖరీఫ్, యాసంగి సాగుకు నీళ్ల డోకా లేకుండా చేసి తెలంగాణను సస్యశ్యా మలం చేస్తే అదే తెలంగాణను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కరువు ప్రాంతంగా మారుస్తున్నదన్నారు. రైతులకు సాగునీరు అందక, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, యూరియా దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 24 నెలల పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను మంథని నియోజ కవర్గంలో మా నాయకుడు పుట్ట మధూకర్ ప్రశ్నించడాన్ని జీర్ణించు కోలేక కాంగ్రెస్ నాయకుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసు కోర్టులో ఉందని.. నిజనిర్ధారణ కాక ముందే కాంగ్రెస్ నాయకులు హంతకుడు అంటూ సంబోధించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు కాచే శశిభూషణ్ మాట్లాడి న తీరుపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. మా నాయకుడు పుట్ట మధూకర్ పై మరోసారి కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే సహిం చేది లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, పాలనను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తగిన గుణ పాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎగోలపు శంకర్‌గౌడ్, సీనియర్ నాయకులు పుప్పాల తిరుపతి, కొండ రవీందర్, పెగడ శ్రీనివాస్, కాయితీ సమ్మయ్య, ఆరెపల్లి కుమార్, పెగడ శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, ఆసీఫ్, ఇర్ఫాన్, ఎరుకల రవి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నివేశన స్థలంలో మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్





**జమ్మికుంట,తెలంగాదిశ:** అర్హులైన పేదలకు కేటాయించిన నివేశన స్థలాల్లో అక్రమంగా డంపింగ్ యార్డ్ కు కేటాయించడం సిగ్గుచేటని, వెంటనే డంపింగ్‌యార్డ్ ని ఎత్తివేసి ఇందిరమ్మ ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మించిఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, డిమాండ్‌చేశారు. అర్హులైన పేదలతో ఎమ్మార్వో కార్యాయం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఓ రమేష్ బాబు,కు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూజ మ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 275, 77, 78,లలో అర్హులైన పేదలను గుర్తించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2006 సంవత్సరంలో సుమారు 370 మంది కి నివేశన స్థలాలు కేటాయించారని, ఇందిరమ్మ పథకంలో భాగంగా కొంతమంది స్లాబ్ లెవల్,లెంటల్ లెవెల్, కొన్ని ఇండ్లు పూర్తిస్థాయిలో నిర్మించు కున్నప్పటికీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ కు కేటాయించడం మూలంగా ఇళ్ల మధ్యలో మున్సిపాలిటీ వారు చెత్తాచెదారం వేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో నివాసయోగ్యంగా లేక కనీస వసతులు లేకపోవడం మూలంగా అక్కడ నివాసం ఉంటున్నవారు పట్టణ కేంద్రంలోని అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అక్రమంగా మున్సిపాలిటీ వారు కొన్ని ప్లాట్లను స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డ్ కు వాడుకుంటున్నారని ఇది సరైనది కాదన్నారు.పేదలకు కేటాయించిన నివేశన స్థలాల్లో అక్రమంగా కేటాయించిన డంపింగ్ యార్డ్ తొలగించి, పేదలకు నివాసయోగ్యానికి ఉపయోగపడే విధంగా మౌలిక వసతులైన కరెంటు నీళ్ల సౌకర్యం రోడ్ల సౌకర్యం కల్పించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్, మండల కమిటీ సభ్యులు బాసిర సంపత్ రావు, దండిగారి సతీష్, కన్నం సదానందం, వడ్లూరి కిషోర్, అర్హులైన పేద లబ్ధిదారులు నాగిశెట్టి వెంకటేశ్వర్లు, గూడెం రాజు, ఎండి ఫయాజుద్దీన్, కనకం సరోజన, మేకల రాజేందర్, దామెర సంతోష్, విజయ, మార్త కృష్ణవేణి, సుమతి, మధునయ్య, సమ్మయ్య, హేమలత, స్వప్న తదితరులు వందమంది లబ్ధిదారులు పాల్గొన్నారు..

# సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధహక్కులు కల్పించండి



**భద్రాద్రి కొత్తగూడెం,తెలంగాణ దిశ:** మణుగూరు ఏరియా సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్‌వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టి యు ఆధ్వర్యంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఏరియా ఇంజనీర్ ఆర్ .శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్. డి. నా సర్ పాషా మాట్లాడుతూ సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం నిర్వహణ బాధ్యతలుబిహెచ్ ఈ ఎల్ తీసుకుందని పలు సంస్థలకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చారని వారిని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించకపోవడంతో సెంట్రల్ జీవో ప్రకారం వేతనాలు, బోనస్, స్పెషల్ ఇన్సెంటివ్, సంక్షేమ పథకాలైన సింగరేణిలో ఉచిత వైద్యం అమలు కావడం లేదన్నారు సింగరేణి యాజమాన్య స్పందించి వేతనాల పెంపు బోనస్ సంక్షేమ పథకాల అమలతో పాటు చట్టబద్ధహక్కులు కల్పించాలని కోరారు. అదేవిధంగా సింగరేణి ద్వారా కాంట్రాక్ట్ వర్కర్లకు ప్రమాద బీమా ఉన్న హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఖాతాలు తెరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ , ఓబి వర్కర్స్ యూనియన్ నాయకులు పెనుగొండ నాగార్జున, లాలయ్య, దుర్గం ప్రణయ్, మిడిదొడ్ల భద్రయ్య, సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్ సెక్యూరిటీ గార్డులు చల్ల కాంతారావు, పి వెంకట్రావు, పి వీరస్వామి ,బి చంద్రం ,డి దేవేందర్, పి శ్రీనివాసరావు, జి ప్రేమ్ కుమార్, పి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి



**కరీంనగర్ ,తెలంగాణ దిశ:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని దీని కొరకు ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా బీసీ సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఆధారంగా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం దానికి అనుగుణంగా అసెంబ్లీలో బిల్లు పెట్టడం జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి ఈ బిల్లును పంపిన ఇంతవరకు దీనిపై స్పందన లేదు కాంగ్రెస్ ప్రభుత్వమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి బీసీ రిజర్వేషన్లను 42 శాతం సాధించాలని బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డిబిసి డిక్లరేషన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో నలభై రెండు శాతం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈనెల 24న 25న రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజు పాల్గొనే పాదయాత్రలో బీసీలందరూ బీసీ సంఘాలు బీసీ నాయకులు పాల్గొని మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ నాయకులు కే శి పెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్, మియాపూర్ రవీంద్ర చారి, మహేష్, రాజు పాల్గొన్నారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం



**కరీంనగర్,తెలంగాణ దిశ:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని దుర్శెడ్ డివిజన్లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ పేరిట.. డివిజన్లో మహిళలకు డివిజన్ కార్యాలయం నందు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొదటగా డివిజన్ కార్యాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసారు జ్యోతి ప్రజ్వలన గావించి.శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్లోని సుమారు 300 మంది మహిళలు హాజరై.. వివిధ రకాల పరీక్షలను చేయించుకున్నారు. అవసరార్థులకు.. ఉచితంగా రక్త పరీక్షలను నిర్వహించి.. అవసరార్థులకు మందులను పంపిణీ చేశారు. ముఖ్యంగా మహిళలు క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తతో ఉండాలని.. ఎప్పటికప్పుడు మూడు నెలలకు ఒకసారి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు,జె,రఘునందన్ రావు, గౌతమ్ రావు, వెంకట్ నారాయణ రావు, వార్డు ఆఫీసర్ మణిదీప్, పి శ్రీహరి రెడ్డి, రవీందర్ రావు, బుర్ర హరీష్ గౌడ్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకో వాలి, మూఢనమ్మకాలపై అవగాహన ఉండాలి..

**మిర్యాలగూడ,తెలంగాణ దిశ:** ప్రతి విద్యార్థి ప్రశ్నించడం ద్వారా అనేక విషయాలను తెలుసుకోవచ్చని ప్రశ్న ఎక్కడైతే ఉంటుందో సమాధానం కూడా అక్కడే ఉంటుందని తెలంగాణ విద్యా వికాస వేదిక నాయకులు కస్తూరి ప్రభాకర్ అన్నారు. స్థానిక మిర్యాలగూడలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిచయం శాస్త్రీయ దృక్పథం అనే అంశం పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంత్రగాళ్ళు తంత్రగాళ్ల పేరుతో వచ్చి పేద ప్రజలను మోసం చేస్తున్న వాటిని నమ్మవద్దని అన్నారు. సామాజికవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తీసుకోవాలని రోజువారి ఆహారంలో ఆకుకూరలు గుడ్డు పప్పు లాంటివి తినడం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్ విటమిన్స్ అందుతాయని ఆపిల్ కన్నా అరటి మేలు చేస్తుందని లడ్డు కన్నా గుడ్డు మరి ఎంతో మంచిదని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కొండల్ రెడ్డి మ్యాజిక్ ద్వారా సైన్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర కృష్ణ కాంత్ నాయక్, ఉపేందర్, ముంతాజ్ బేగం, తావూరియా, సంతోష్,అనిత జ్యోతి, ధనలక్ష్మి, అశ్విని, స్పందన, బేబీ రాణి, కాంతయ్య,స్వామి,జానయ్య లక్ష్మయ్య, జంగయ్య, మీనా, భవాని, సీమ, నస్రీన్, పేరయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆరేంద కాంప్లెక్స్ హెచ్ఎం గా బాధ్యతలు చేపట్టిన ఈదులపల్లి నరసింహారావు



**మంథని,తెలంగాణ దిశ:** మంథని మండలంలోని ఆరేంద గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మరియు కాంప్లెక్స్ హెచ్ఎం గా ఈదులపల్లి నరసింహారావు బాధ్యతలు చేపట్టారు. మొన్న ప్రభుత్వం చేపట్టిన పదోన్నతులలో భాగంగా యుపిఎస్ చిల్లపల్లి పాఠశాలలో పని చేస్తున్న నరసింహారావు పదోన్నతి పొంది జడ్పీహెచ్ఎస్ ఆరెంద పాఠశాలకు ప్రధానోపాధ్యా యులుగా నియమించబడ్డారు. ప్రమోషన్ పొంది ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందని నరసింహారావు అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సువార్త, గీయసుద్దీన్, మమత, పద్మజ, శ్రీలత, ప్రమీల, సిఆర్పి మల్లన్న, అమన్ లు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ అభిమానుల మధ్య ఘర్షణ



## 10 మందికి గాయాలు, 90మంది అరెస్ట్

బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా) : అర్జెంటీనాలో రెండు క్లబ్‌ల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఘర్షణలో కనీసం 10మంది గాయపడగా..కనీసం 90మంది అరెస్ట్ చేసినట్లు క్లబ్ అధికారులు, పోలీసులు తెలిపారు.అవెల్లనెడాలోని లిబర్టాడోర్స్-డి-అమెరికా స్టేడియంలో అర్జెంటీనా ఇండిపెండెంట్, కోపా సుడామెరికానా(చిలీ) జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. రెండో అర్ధభాగం 48వ నిమిషంలో స్థానికజట్టు మద్దతుదారులు ప్రత్యర్థి జట్టు అభిమానులపై రాళ్లు, కర్రలు, సీసాలు విసిరారని, వారి దుస్తులను చింపివేశారని అక్కడే ఉన్న ఒక విలేకరి తెలిపారు. ఒక్కసారిగా జరిగిన దిగ్భ్రాంతికరమైన ఘటనతో చిలీ అభిమానులంతా స్టేడియం నుంచి బయటకు వెళ్లిపోయారని, ఘర్షణ అనంతరం గ్యాలరీలోని ఒక భాగం వస్తువులు, స్టన్ గ్రెనేడ్స్‌తో నిండిపోయినట్లు ఆ విలేకరి తెలిపారు. ఈ ఘటనకు కారులైన 90మందిని అరెస్ట్ చేసినట్లు అర్జెంటీనా భద్రతా మంత్రిత్వ శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ హింసకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని సోషల్ మీడియాలో తెలుపగా.. చిలీ రాయబారి ఒకరిద్దరిపై కత్తిపోట్లు ఉన్నట్లు, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇండిపెండెంట్ అధ్యక్షుడు నెస్టర్ గ్రిండేటి చిలీ క్లబ్ మద్దతుదారులకు అండగా నిలువగా.. ఈ హింసను ఊహించలేకపోయానని, ఇండిపెండెంట్ తరఫున ఆడే చిలీ అంతర్జాతీయ ఆటగాడు ఫెలిప్ లయోలా సోషల్ మీడియాలో తెలిపాడు. మ్యాచ్ నిలిపివేసే సమయానికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా ఉన్నాయి. చిలీ రాజధాని శాంటియాగోకు చెందిన జట్టు తొలి లీగ్‌ను 1-0తో గెలుచుకుంది. ఏప్రిల్‌లో కోపా లిబర్టాడోర్స్‌లో చిలీకి చెందిన కోలో కోలో మరియు బ్రెజిలియన్ క్లబ్ ఫోర్టలెజా మధ్య జరిగిన ఆటకు ముందు శాంటియాగోలోని మాన్యుమెంటల్ స్టేడియం వెలుపల అభిమానులు మరియు పోలీసుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు అభిమానులు మరణించిన సంగతి తెలిసిందే.

# చివరి ఆయకట్టుకు చుక్కనీరూ కరువే



## రాజాం, బొబ్బిలి, పార్వతీపురం వరకే 'తోటపల్లి'
## నెల్లిమర్ల, చీపురుపల్లికి చేరని వైనం

**విజయనగరం,తెలంగాణ దిశ:** తోటపల్లి జలాశయం నిండా నీరు ఉన్నప్పటికీ, చివరి ఆయకట్టుకు మాత్రం అందడం లేదు. 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా 25వేలకు మించి సాగునీరు అందడం లేదు. దీంతో, తోటపల్లి నీటికోసం ఎదురు చూస్తున్న చివరి ఆయకట్టుదారులకు ఈ ఏడాది కూడా నిరాశే ఎదురైంది. ముఖ్యంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాలకు చుక్కనీరు రావడం లేదు. 64 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తూనే 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి బ్యారేజీ సామర్థ్యాన్ని పెంచి, కుడికాలువ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందుకనుగుణంగానే నాగావళి నది నుంచి జలాశయంలోకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. కానీ, కాలువల మిగులు పనులు పూర్తి చేయకపోవడం, కుడి ప్రధాన కాలువ నిర్వహణ గాలికి వదిలేయడంతో ఏటా సాగునీటి సరఫరా తగ్గిపోతోంది. 2004లో చేపట్టిన ఈ జలాశయ నిర్మాణం ద్వారా 2015 ఖరీఫ్ సీజన్‌లో తొలిదశ నీరు అందించారు. నాటి నుంచి 2018 వరకు సుమారు 86 వేల ఎకరాలకు సాగునీరు లభించేది. దీంతో, శివారున ఉన్న గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలకు సైతం నీరు అందేది. వందలాది చెరువుల్లో నీరు నింపడంతో వరిపంటలు పుష్కలంగా పండేవి. ప్రాజెక్టు కాంట్రాక్టు కాలపరిమితి 2017తో పూర్తికావడంతో ప్రభుత్వం కాలువల నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో, కాలువలో పూడిక పేరుకుపోయింది. సువర్ణముఖి %-% వేగావతి నదుల క్రాసింగ్, బాతువ రైల్వే క్రాసింగ్ సహా పలుచోట్ల వేసిన లైనింగ్ పనులు దెబ్బతిన్నాయి. ఆ డెబ్రిస్ అంతా ప్రధాన కాలువలో పడిపోయింది. ఈనేపథ్యంలో క్రమంగా సాగునీటి సరఫరా తగ్గుతూ వస్తోంది. గరుగుబిల్లి, సీతానగరం, బొబ్బిలి మండలాల పరిధిలో కుడికాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ తెర్లాం, రాజాం వరకు వచ్చేపాటికి తగ్గిపోతోంది. చీపురుపల్లి, నెల్లిమర్ల మండలాలకు చుక్కనీరు రావడం లేదు. గడిచిన మూడు రోజులుగా కురిసిన వర్షపు నీటితోనే రైతులు ఉబాలు పట్టుకుంటున్నారు. అధిక వర్షాలు, తుపాన్లు వస్తేనే వరి సాగుచేసుకుంటున్నామని, లేదంటే తమ భూములు బీడువారుతున్నాయని పూసపాటిరేగ మండలం ఆర్‌జిపాలేనికి చెందిన గేదెల సీతబాబు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికీ ఉబాలు పట్టుకోలేక పోయామని ఇదే మండలం కందివలసకు చెందిన మరికొంతమంది రైతులు వాపోయారు. ఈ ఏడాది 25 వేల ఎకరాలు సాగు: పూడిక తీతకు రూ.15 కోట్లు, లైనింగ్ పనులకు రూ.వంద కోట్లు అవసరం కానున్నట్టు గడిచిన మూడేళ్లగా అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలకు పరిమితమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది ఈపాటి నీరు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ప్రాజెక్టు పనులు పూర్తికి రూ.519 కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.47.81కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయిం చింది. ఆచరణలో నిధుల విడుదల అంతంతమాత్రంగానే కనిపిస్తోం ది. దీంతో, పిల్లకాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉన్నాయి.

# ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీల రాజకీయం



## - ఉత్తర్వులలో అధికారపార్టీ ఎంఎల్‌సిలకు ప్రాధాన్యత
## - తమను విస్మరించడం పట్ల సంఘాల ఆగ్రహం

అమరావతి: ఎంతో కాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న అంతర్‌జిల్లా బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత కారణాలను, ఆరోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకుని ఈ బదిలీలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే, టిడిపి ఎంఎల్‌సిలు వేపాడ చిరంజీవిరావు, పేరాబత్తుని రాజశేఖర్, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ తదితరులు ఇచ్చిన వినతి మేరకు ఈ బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని యుటిఎఫ్, ఎస్టియు, ఎపిటిఎఫ్‌లతో పాటు అనేక సంఘాలు రాష్ట్రప్రభుత్వానికి ఏడాది నుంచి వినతిపత్రాలు అందిస్తునే ఉన్నాయి. గతేడాది డిసెంబర్ 13వ తేదిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించారు. ఈ చర్చల సమయంలో కూడా అంతర్‌జిల్లా బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు మంత్రిని కోరాయి. సంఘాలతో పాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కూడా అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని పలుమార్లు వినతిపత్రాలు అందించారు. జులై 17వ తేదిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను, ఈ నెల 11వ తేదిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును కలిసి అంతర్ జిల్లాల బదిలీలు నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. ఇదే అంశంపై ఈ నెల 19వ తేది కూడా లోకేష్‌తో పాటు కమిషనర్‌కు కూడా లేఖ రాశారు. అంతర్ జిల్లాల బదిలీలపై యుటిఎఫ్ ఈ నెల 12వ తేదిన పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి లేఖ రాసింది. విద్యాశాఖ మంత్రి సంఘాలతో చర్చలు జరిపిన రోజే ఎస్టియు కూడా ఈ ప్రస్తావన తీసుకొచ్చింది. అయితే, ఈ విజ్ఞప్తులన్నింటిని పక్కన బెట్టి టిడిపి ఎంఎల్‌సి పేర్లు మాత్రమే ఉత్తర్వులలో పేర్కొనడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. బదిలీలపై తాము కూడా ప్రాతినిధ్యం వహించామని, అయినా తమ ఉత్తర్వులను రిఫరెన్స్‌లో పెట్టకపోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రస్తావించారు.

# కమాన్ పూర్ పోచమ్మ కుంటను కాపాడాలి



## -సిపిఎం ఆధ్వర్యంలో పేదల పాదయాత్ర,
## ఆర్డీవోకు వినతి పత్రం అందజేత...

**మంథని,తెలంగాణ దిశ:**రెడ్డి చెరువు భూములను కాకర్లపల్లి దళితులకు పంచాలని,కమాన్ పూర్ పోచమ్మ కుంటలు కాపాడాలని సిపిఎం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి వై యాకయ్య డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కాకర్లపల్లి గ్రామ దళితులు, కమాన్ పూర్ గ్రామస్తులు మంథని పాత పెట్రోల్ బంక్ నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించిఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం మంథని ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి వై యాకయ్య మాట్లాడుతూ మంథని మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబాలకు గత 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వం రెడ్డిచెరువు సీలింగ్ భూములను ఇచ్చి రెవెన్యూ రికార్డులో నమోదు చేసిందని కానీ భూములను చూపించలేదని ఇట్టి భూములను పంచి పట్టాలు చేయాలని దళితులు అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. భూమి యజమాని సీలింగ్ యాక్ట్ ప్రకారం భూములు ప్రభుత్వానికి ఇచ్చినప్పటికీ తప్పుడు డాక్యుమెంట్లతో కోర్టులో కేసులు వేస్తూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ దళితులను కోర్టు కేసుల పేరుతో బెదిరింపులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. దళితులపై సిపిఎం నాయకుల పైన ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదని ధ్వజమెత్తారు. దళితులకు రెడ్డి చెరువు
భూములు దక్కేంతవరకు సిపిఎం కాకర్లపల్లి గ్రామ దళితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తుందని అన్నారు అలాగే కమాన్పూర్ మండల కేంద్రంలోని పోచమ్మ కుంట ఆక్రమణకు గురవుతుందని చెరువు కింద వ్యవసాయం చేసుకుంటున్న రైతాంగానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుంట భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి అక్రమ పట్టాలు చేసుకుంటున్నారని అన్నారు భావితరాల
కోసం పోచమ్మ కుంటను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పోచమ్మ కుంట ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, డి కొమరయ్య, సిపిఎం నాయకులు కుమార్, ఆర్ల సందీప్, గోరింకల సురేష్, కమాన్పూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తున్న మంత్రి శ్రీధర్ బాబు
## -2లక్షల 50వేల ఎల్‌ఓసి పత్రాల అందజేత



మంథని: పేద ప్రజలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారు. అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు ఎల్‌ఓసీలు మంజూరు చేయిస్తూ భరోసా కల్పిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పర్షవేనీ లక్ష్మి కి 2లక్షల 50వేల ఎల్‌ఓసి ని మంజూరు చేసి ఇప్పించారు. పర్షవేనీ లక్ష్మి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు సహాయం కొరకు మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రిసహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తవీరికి 2లక్షల50 వేలఎల్‌ఓసి మంజూరు చేయించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బా బు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లోఎల్‌ఓసి పత్రాలను అందజేశారు.2లక్షల50 వేల ఎల్‌ఓసి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు పర్షవేనీ లక్ష్మి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**హుజురాబాద్,తెలంగాణ దిశ:**కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు,ప్రణవ్ నాయకత్వాన్ని బలపరించేందు కు పార్టీలో చేరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల, బిజిగిరి షరీఫ్ గ్రామాల పరిధిలోని పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తనుగుల పాక్స్ చైర్మెన్ పోల్సాని వెంకటేశ్వర్ రావు,బిజిగిరి షరీఫ్ గ్రామ తాజా,మాజీ సర్పంచ్ కటంగురి యుగంధర్ రెడ్డి లు పార్టీలో తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వంలోకి వచ్చిన 18నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదవాడికి వెన్నెముకలాగా మారిందని, ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీలకు రెండు సార్లు కొనసాగింపు ఇచ్చినందుకు ప్రభుత్వానికి,హుజూరా బాద్ ఇంచార్జి గా ఉన్న ప్రణవ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ప్రణవ్ తోనే సాధ్యమని ఆ వంతుగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# కక్షా కాంక్ష!

పక్కదోవ పట్టించే వక్ర రాజకీయాలకు పెట్టింది పేరైన బిజెపి ఓట్ల చోరీ అంశంపై నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించటానికి పార్లమెంటును వేదికగా వాడుకుంటోంది. అసలు ఎజెండాలోనే లేని మూడు కీలకమైన బిల్లులను హోంమంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 30 రోజుల పాటు జైల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు 31వ రోజుకు పదవిని ఆటోమేటిగ్గా కోల్పోతారన్నది ఈ బిల్లులోని కీలకాంశం. 130వ రాజ్యాంగ సవరణ ద్వారా జమ్మూ కాశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలు సహా దేశమంతటా దీనిని వర్తింపజేయాలన్నది మోడీ సర్కారు ఉద్దేశం. ఈ బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తమకు ఇష్టం లేని రాష్ట్ర ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టటానికే మోడీ ప్రభుత్వం ఈ బిల్లులను ఆకస్మికంగా తెర మీదికి తెచ్చిందని తీవ్రంగా విమర్శించాయి. దర్యాప్తు సంస్థలు మొత్తాన్ని తమ జేబుసంస్థలుగా మార్చేసి, దేశవ్యాప్తంగా సాగించిన, సాగిస్తున్న బెదిరింపులు, అణచివేత ఉదంతాలను ఉదాహరణలుగా ఎత్తి చూపాయి. ఈ బిల్లులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా ఉన్నాయని, చట్టరూపు దాలిస్తే అధికార బిజెపి చేతిలో అదనపు ఆయుధాలుగా దుర్వినియోగమవుతా యని పేర్కొన్నాయి. తీవ్ర నిందారోపణలకు గురైనప్పుడు, ప్రమాద నివారణలో వైఫల్యం చెందారనే భావన ఉత్పన్నమైనప్పుడు ప్రజాప్రతినిధులు అందుకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేసే ఆనవాయితీ ఉంది. తక్షణం పదవిలోంచి తప్పుకున్న వాళ్లున్నారు. ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమైనా పదవిని పట్టుకొని వేళ్లాడినవారూ ఉన్నారు. అయితే, అది ఒక విధానంగా కాక సందర్భాలను బట్టి వ్యవహరించటం ఆయా ప్రభుత్వాల వైఖరిపై ఆధారపడి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కక్షపూరితంగా వ్యవహరించినప్పుడు కేసుల నమోదు, అరెస్టులు ఎంత త్వరగా జరుగుతాయోబీ అనుకూలంగా మారినప్పుడు దర్యాప్తులు ఎంతగా కొడిగట్టిపోతాయో దేశ ప్రజలు చూస్తూనే ఉన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ ఈ తంతు బహిరంగంగా జరుగుతూనే ఉంది. ప్రశ్నించేవారిని ఉపా చట్టం కింద ఏ విచారణా లేకుండానే జైళ్లలో నిర్బంధించటం, దేశద్రోహం కేసులతో వేధించటం నడుస్తోంది. బ్రిటీషు పాలకులు వదిలిపోయిన పీడక చట్టాలకు కొత్త కోరలు మొలిపించి మరీ అమలు చేస్తోంది. ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలపై గవర్నర్ల ద్వారా అప్రజాస్వామికంగా కర్ర పెత్తనం చెలాయించజూస్తోంది. సిబిఐ, ఇడి, ఎలక్షన్ కమిషన్ వంటి సంస్థలు కేంద్రం చేతిలో కీలుబొమ్మలై స్వతంత్రతను ఎంతగా కోల్పోయాయో దేశం కళ్లారా చూస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వివిధ సంస్థల మీద దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం, వాటి యజమానులు బిజెపిలో చేరడమో, దానికి దాసోహం అవ్వడమో చేస్తే కేసులు కొండెక్కి పోవడం మామూలైపోయింది! నిత్యం నీతులు వల్లించే బిజెపి నిస్సిగ్గు రాజకీయం మన సమాఖ్య విధానానికి, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూనే ఉంది. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నర్ల ద్వారా అడ్డగోలు అజమాయిషీ చేయించే దుర్నీతిపై దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎప్పటికప్పుడు తలంటుతున్నా %-% కేంద్రంలోని బిజెపి తలొగ్గటం లేదు. పైగా ప్రత్యక్షంగా ఎదురుదాడికి దిగుతోంది. నీతి, నిజాయితీ, నైతిక విలువల గురించి కాషాయ పరివారం చెప్పే మాటలూ, చేతలూ ఒక గాడిలో సాగవు. 2002లో గుజరాత్ అల్లర్లలో 2 వేల మంది ప్రాణాలు కోల్పోవటానికి అప్పటి ముఖ్యమం త్రి మోడీ ఉద్దేశపూర్వక ఉదాసీనతా, పరోక్ష ప్రేరణా కారణమని తీవ్రమైన విమర్శలు వచ్చినా తనను తాను సమర్థించుకున్నారు తప్ప నైతిక బాధ్యతగా ఒక కన్నీటిబొట్టు కూడా కార్చలేదు. 16 మందిని సజీవ దహనం చేసిన బెస్ట్ బేకరీ కేసులో నిందితులంతా గుజరాత్ కోర్టులో నిర్దోషులుగా విడుదలకావటం, తరువాత సుప్రీంకోర్టు జోక్యంతో ఆ కేసు పునర్విచారణ మహారాష్ట్రకు మారి, నిందితులకు శిక్ష పడడం దేశానికి తెలిసిందే! కేంద్రంలో అధికారం లోకి వచ్చాక బిజెపి నాయకులు ఆరోపణలు ఎదుర్కొన్న కేసులన్నీ వీగిపోయాయి. ఆ పార్టీలో చేరితే అవినీతి మరకలు మాయమైపోతా యనే వ్యంగ్య విమర్శను పరిశీలకులెవరూ కొట్టి పారేయలేరు. 2021లో మూడు నల్లచట్టాలను వ్యతిరేకించే రైతులపై నుంచి బిజెపి మంత్రి కొడుకు కారు నడిపి, నలుగురి మరణానికి కారణమైనా %-% ఆ మంత్రి ఏ బాధ్యతా తీసుకోలేదు. ఇలాంటి నేపథ్యంలో బిజెపి తీసుకొచ్చే మూడు బిల్లులూ ఎంత వక్ర దృష్టితో, నిరంకుశ ధోరణితో కూడినవో అర్థం చేసుకోవచ్చు. ప్రతిపక్షాలపై కక్షా కాంక్షతో తీసుకొచ్చిన ఈ బిల్లులను ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకించాలి.

# ట్రూత్ బాంబ్ పేరిట వైసీపీ

## అచ్చెన్నాయుడి లెక్కలు తీస్తున్న ప్రతిపక్షం

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ:**ఒకప్పుడు రాజకీయ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకునేవారు. ఏవైనా అవినీతి అక్రమాలు బయటపడితే వాటిని సాక్షాలతో వెల్లడించేవారు. ఇప్పుడు సోషల్ మీడియా రోజులు కాబట్టి..రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ద్వారానే తమ ప్రత్యర్థుల అవినీతి అక్రమాలను బయటపెడుతున్నాయి. ఏపీలో టిడిపి, వైసిపి మధ్య సోషల్ యుద్ధం ఒక స్థాయిలో జరుగుతోంది. ఇటీవల ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఉదంతాన్ని ట్రూత్ బాంబు రూపంలో బయటపెట్టిన వైసీపీ సోషల్ మీడియా.. ఇప్పుడు మంత్రి అచ్చె న్నాయుడు విషయంలోనూ ఓ సంచలన నిజాలను బయటపెట్టింది.అచ్చె న్నాయుడు కూటమి ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు.. అయితే ఆయన అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారని.. ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ జనరల్ మేనేజర్ రాజమ్మోహన్ పై కక్ష కట్టారని వైసీపీ ఆరోపిస్తోంది. వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులతో మధ్యవర్తిత్వం చేయాలని మంత్రిపేసి నుంచి రాజమోహన్ కు తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చిందని వైసిపి సోషల్ మీడియా విభాగం తన పోస్ట్ లో పేర్కొంది. అవినీతికి సహకరించబోనని రాజమోహన్ చెప్పడంతో ఆయనను నెల్లూరుకు బదిలీ చేయించారని వైసిపి ఆరోపించింది. రాజమోహన్ స్థానంలో జనరల్ మేనేజర్ పోస్టుకు ఏమాత్రం అర్హతలేని జూనియర్ అధికారిని.. పెండింగ్ కేసులు ఉన్న వ్యక్తిని నియమించుకున్నట్టు వైసిపి పేర్కొంది. ఈ నేపథ్యంలో తనకు సెలవు పై వెళ్లడం తప్ప మరో మార్గం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి రాజమోహన్ లేఖ రాసినట్టు వైసిపి పేర్కొంది.ప్రభుత్వ పెద్దల అడ్డగోలు దోపిడీకి సహకరించని అధికారులనుబదిలీల పేరుతో వేధిస్తారు అంటూ వైసీపీ ఆరోపించడం మొదలు పెట్టింది. “ఇదేనా మీ మంచి ప్రభుత్వం.. ఇదేనా మీరు చేస్తున్న మంచి?” అంటూ వైసీపీ సోషల్ మీడియా విభాగం ప్రశ్నించింది.. దీనిపై టిడిపి ఎలాంటి కౌంటర్ ఇస్తుందనేది చూడాల్సి ఉంది. మరోవైపు వైసీపీ బయటపెట్టిన ఈ విషయాలకు టిడిపి అనుకూల నెటిజన్లు గట్టిగా స్పందిస్తున్నారు. “మీ హయాంలో అవినీతి అనేది తారాస్థాయికి చేరింది. మీరు కూడా ఇప్పుడు నీతులు మాట్లాడటం ఏంటని” టిడిపి అనుకూల నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

# అమాత్య... ఆశలేనా!

**విజయవాడ,తెలంగాణ దిశ:**ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీలోని పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నారు. మాజీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి దగ్గర నుంచి అనేక మంది తమకు పదవులు దక్కలేదన్న అసహనంతో ఉన్నారు. పార్టీలో కీలకంగా ఉన్న తమకు పదవులు దక్కకపోవడంతో పాటు పార్టీలో పేరు వినిపించని నేతలకే ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తున్నారు. అందులో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఒకరు. సుజనా చౌదరి రాష్ట్ర రాజకీయాలంటే ఆయనకు పొసగదు. ఆయనకు కేంద్ర రాజకీయాలంటేనే ప్రీతి. అందుకే రెండుసార్లు రాజ్యసభకు అడిగి మరీ ఎంపిక చేయించుకున్నారు. ఒకసారి కేంద్ర మంత్రి పదవిని కూడా చేపట్టారు. 2024 ఎన్నికలకు వచ్చేసరికి సుజనా చౌదరికి ఎంపీ టికెట్ దక్కలేదు. వాస్తవానికి విజయవాడ పార్లమెంటు టికెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా ఆయనకు సీటు దక్కలేదు. తన కొలీగ్ సీఎం రమేష్ కు మాత్రం అనకాపల్లి ఎంపీ సీటు దక్కింది. సుజనా చౌదరి అయిష్టంగానే ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన తనకు బీజేపీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని గట్టిగా భావించారు. తాను సీనియర్ నేత కావడంతో పాటు అనేక అంశాల్లో టీడీపీతో తనకున్న సంబంధాలు కూడా మంత్రి పదవిని తెచ్చిపెడతాయని ఆయన ఆశించారు. కానీ కేంద్ర నాయకత్వం ఆలోచన వేరే విధంగా ఆచరణలోకి పెట్టడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సత్యకుమార్ యాదవ్ కు మంత్రి పదవి దీంతో ఆయన పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు. సామాజికవర్గం కోణంలో తనకు భవిష్యత్ లోనూ, అంటే ఈ ఐదేళ్లలో మంత్రి పదవి చంద్రబాబు నాయుడు కేబినెట్ లో దక్కే అవకాశం లేదని ఆయనకు అర్థమయింది. దీంతో ఆయన తన పశ్చిమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. సుజనా చౌదరి కేంద్రమంత్రిగా పనిచేసి కేవలం శాసనసభ్యుడిగా మిగిలిపోవడంతో ఆయన అనుచరులు కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నటప్పటికీ విపక్షాలపై విమర్శల విషయంలో ఆయన పెద్దగా ఆసక్తి చూపకపోవడం కారణమిదేనని అంటున్నారు. చంద్రబాబు కేబినెట్ లో ఇప్పటికే నలుగురు కమ్మ సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఉండటంతో మరొకరికి ఛాన్స్ ఇచ్చేందుకు ఇటు టీడీపీ, అటు బీజేపీ ఆసక్తి చూపదన్న అంచనాలతో ఆయన అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

# యూరియాపై ఎందుకీ దోబూచులాట?



**హైదరాబాద్,తెలంగాణ దిశ:**యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతుంటే ప్రభుత్వం బాధ్యతాయుత ప్రకటన చేయడం లేదు. లేఖలు రాసినా స్పందించడం లేదు. ఇదేదో తమకు సంబంధించిన వ్యవహారం కాదన్న విధంగా మౌనంగా ఉన్నారు. తెలంగాణలో ఇటీవలి వరకు బిజెపి నేతలు ఎదురుదాడి చేశారు. తగినంతగా యూరియా సరఫరా చేసినా బ్లాక్ మార్కెట్‌కు తరలించారని విమర్శలు చేశారు. ఇంతగా బాధ్యతా రహితంగా ప్రకటన చేయడం ఎంతవరకు సమంజసం. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రాష్ట్రంలో ఎరువుల కొరత పాపం ముమ్మాటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీలదే. ఎరువులను కొందరు కాంగ్రె స్ నాయకులు బ్లాక్ మారెట్‌లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలి. 70 లక్షల మంది తెలంగాణ రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే బీజేపీలు నేతలు మాట్లాడక పోవడం దారుణం. ఎరువుల కొరతపై కేం÷–రం స్పష్టత ఇవ్వాలి. రెండు నెలలుగా తెలంగాణలోని ఏ పల్లె చూసినా రైతుల దయనీయ పరిస్థితి కనిపిస్తున్నది. ఎరువుల కోసం చాంతాడంత లైన్లో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ నిలబడి రైతులు అవస్థలు పడుతున్నారు. యూరియా కోసం దుకాణాల ముందు మహిళా రైతులు రాత్రంతా పడిగాపులు

### వ్యవసాయ విధానంపై స్పష్టత ఏదీ సేంద్రియ వ్యవసాయం చర్యలేవీ..?

పడే పరిస్థితికి వచ్చింది. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. కేవలం యూరియా కొరతతోనే అన్నదాతలు పడిగాపులు పడుతుంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యమో తెలియాలి. మన అవసరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి.

సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మనరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు.

కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకే సరిపోతుంది.

ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతు న్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభి స్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుం టున్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి.

# మన బలం..బలగం అంతా అదే

ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట వేదికగా ఇచ్చిన ‘మేడిన్ ఇండియా’ పిలుపు దేశ పౌరులందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. భారతీయ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించాలని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో భారతీయుం.. భారత వస్తువులనే కొందాం అనే నినాదం విస్తృతమవుతోంది. జనంలోకి వెళ్తోంది. పండుగల వేళ.. ఇది శుభ పరిణామమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాజ్యాంగం పౌరులకు హక్కులను అందించినట్లే, ప్రాథమిక బాధ్యతలను కూడా నిర్దేశించింది. రోడ్లు, డ్రైనేజీ బాగోలేకపోతే.. వ్యవస్థలను, అధికారులను, రాజకీయ నాయకులను తిట్టుకుంటాం. ఇలాగైతే దేశం ఎప్పుడు అభివృద్ధి చెందుతుందంటూ ఆవేదన చెందుతాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. అయితే, మన హక్కుల కోసం ఎలాగైతే గొంతెత్తుతామో.. దేశానికి అవసరమైనప్పుడు మన వంతు కర్తవ్యం నిర్వర్తించాల్సిన బాధ్యత కూడా మనపై ఉంది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక బాధ్యతల గురించి చిన్నప్పుడు పాఠశాలలోనే చదువుకున్నాం.అయితే, ఆ బాధ్యతలను పాటించాలనే విషయం మర్చిపోతుంటాం. దేశానికి అండగా నిలబడాలని ప్రధాని నరేంద్ర మోదీ.. ఆగస్టు 15న ఎర్రకోట వేదికగా ప్రజలకు పిలుపునిచ్చారు. ‘మేడిన్ ఇండియా’ వస్తువులనే వాడాలని పిలుపునిచ్చారు.భారతీయ వస్తువులను వాడితేనే, దేశం ఆత్మ నిర్భరత సాధిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. అయితే, దేశ అభివృద్ధిలో పౌరుల బాధ్యత కూడా కీలకమని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ‘మేడిన్ ఇండియా’ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉద్యోగ అవకాశాలను సృష్టించడం సాధ్యమవుతుంది. ఈ బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించాల్సిన అవసరం ఉంది.

భారతదేశంలో అనేక రంగాల్లో ఉత్పత్తులను తయారు చేస్తున్న స్థానిక బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. నిత్యావసర వస్తువుల నుంచి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఔషధాల వరకు వివిధ రకాల ఉత్పత్తులను భారతీయ కంపెనీలు అందిస్తున్నాయి. వస్తువులు కొనుగోలు చేసే ముందు ‘మేడ్ ఇన్ ఇండియా’ లేబుల్‌ను తనిఖీ చేయడం ద్వారా స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వవచ్చు.‘మేడిన్ ఇండియా’ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ఈ చర్య దేశంలో డబ్బు రొటేషన్‌ను పెంచుతుంది, ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది, నిరుద్యోగ సమస్యను తగ్గిస్తుంది. స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ పెరిగితే, కంపెనీలు ఉత్పత్తిని విస్తరించి,

మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తాయి. ఇది దేశ జీడీపీని పెంచడమే కాక, రూపాయి విలువను బలోపేతం చేస్తుంది. అదనంగా, దిగుమతులపై ఆధారపడటం తగ్గడం వల్ల విదేశీ మారక నిల్వలు రక్షించబడతాయి. స్థానిక బ్రాండ్లకు మద్దతు ఇవ్వడం వల్ల కంపెనీలు ఆవిష్కరణలు, పరిశోధనలలో ఎక్కువ పెట్టుబడులు పెడతాయి, దీనివల్ల ఉత్పత్తుల నాణ్యత మెరుగవుతుంది. ఇది భారతీయ కంపెనీలను అంతర్జాతీయంగా పోటీపడే స్థాయికి తీసుకెళ్తుంది.చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులు, ముఖ్యంగా చవకైన ఎలక్ట్రానిక్స్, గ్యాడ్జెట్స్, భారతీయ మార్కెట్లో గణనీయమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఇవి కొనుగోలు చేయడం వల్ల దేశ ఆర్థిక వనరులు విదేశాలకు వెళ్తాయి, స్థానిక కంపెనీలకు నష్టం కలుగుతుంది. దీనిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దిగుమతి వస్తువులకు బీఐఎస్ ప్రమాణాలను తప్పనిసరి చేస్తోంది. చైనా వస్తువులకు బదులుగా ‘మేడిన్ ఇండియా’ ఉత్పత్తులను ఎంచుకోవడం ద్వారా స్థానిక పరిశ్రమలను రక్షించడమే కాక, దేశ ఆర్థిక స్వావలంబనను పెంపొందించవచ్చు.‘మేడిన్ ఇండియా’ ఉత్పత్తులను కొనుగోలు చేయడం కేవలం ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును రూపొందించే బాధ్యత. ప్రతీ కొనుగోలు నిర్ణయం దేశంలో ఉపాధి, ఆవిష్కరణ, ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ కొనుగోళ్లలో ‘కంట్రీ ఆఫ్ ఆరిజిన్’ తనిఖీ చేయడం ద్వారా పౌరులు తమ వంతు కషి చేయవచ్చు.

ప్రధాని మోదీ ఆశయం సాకారం కావాలంటే, ప్రతి భారతీయుడు ఈ బాధ్యతను స్వీకరించాలి.ఈ బ్రాండ్స్ మాత్రమే కాకుండా.. మనం ఏ వస్తువు తీసుకున్నా.. దాదాపు భారతీయ కంపెనీలు దాన్ని తయారు చేస్తున్నాయి. వస్తువులు తీసుకునే ముందు దానిపై ‘కంట్రీ ఆఫ్ ఆరిజిన్’ చూడాలి. భారత్‌లో ఉత్పత్తి అయితే, ఇక్కడ ‘మేడ్ ఇన్ ఇండియా’ అని ఉంటుంది. ఆన్‌లైన్‌లో కూడా కంట్రీ ఆఫ్ ఆరిజన్ ఉంటుంది. విదేశీ బ్రాండ్స్ అయినా..

దానిపై మేడ్ ఇన్ ఇండియా అని ఉంటే.. ఆ వస్తువులు కూడా తీసుకోవచ్చు.మేడిన్ ఇండియా వస్తువులు కొంటే.. వాటికి డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా వాటిని కంపెనీలు ఎక్కువ ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. దీని కోసం ఆయా కంపెనీలు ఉద్యోగులను పెంచుకోవాల్సి ఉంటుంది. అలా ఉద్యోగులను నియమిం చుకుని కంపెనీలు ప్రొడక్షన్ పెంచితే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఎక్కువ మంది దగ్గర డబ్బులు ఉంటే.. ఎక్కువ వస్తువులు కొనుగోలు చేయొచ్చు.మేడిన్ ఇండియా’ వస్తువు కొనాలనుకున్నప్పుడు.. కేవలం ఒక ప్రొడక్ట్ మాత్రమే కొనడం లేదనే విషయం గుర్తుంచుకోవాలి. ఆత్మ నిర్భర, సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన భారత్ కోసం ఒక్కో ఇటుక పేరుస్తున్నట్లే. ప్రపంచ దేశాలతో పోటీ పడి భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలంటే.. మనం ఈ పని చేయక తప్పదు.

# మిస్ ఫైర్ అవుతున్న మర్వాడి గో బ్యాక్..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఒకప్పుడు ఉద్యమాలు ప్రజల చైతన్యంతో జరిగేవి. ప్రజలు మూకుమ్మడిగా వీధుల్లోకి వచ్చేవారు. నినాదాలు చేసే వారు. నిరసనలు చేపట్టేవారు. తమ సమస్యను పరిష్కరించుకునే వారు. ఇలాంటి ఉద్యమాలే ప్రపంచ చరిత్ర గతిని.. భారతదేశ గతిని మార్చేశాయి.నేటి కాలంలో ఉద్యమాలు మొత్తం సోషల్ మీడియా ద్వారా జరుగుతున్నాయి. అంతటి అమెరికాలో కూడా ఇటీవల కాలంలో ట్రంప్ వ్యతిరేక ఉద్యమాలు సోషల్ మీడియా వేదిక ద్వారానే పుట్టడం విశేషం. ఇవి మాత్రమే కాదు చాలా ఉద్యమాలు సోషల్ మీడియా వేదికగానే జరుగుతున్నాయి.. ఈ ఉద్యమాలు సహించని వారు టూల్ కిట్ అంటూ ఏవేవో వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ.. ఉద్యమాలు చేసే వారు ఏమాత్రం ఆగడం లేదు.

పైగా రకరకాల రూపాలలో ఉద్యమాలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో మార్వాడి గో బ్యాక్ అనే ఉద్యమం జరుగుతోంది. ఏకంగా అమనగల్లు అనే ప్రాంతంలో బంద్ కు పిలుపు కూడా జరిగింది. ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావడంతో ఈ బంద్ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఈ సమస్య మూలాలను ఒకసారి పరిశీలిస్తే.. నేటికీ గ్రామాల్లో కోమట్లు, స్వర్ణకారులు, ఇతర కులవృత్తుల వారు వారి వారి వ్యాపారాలు చేస్తున్నారు. మన తెలంగాణలోకి మార్వాడీలు ఎప్పటినుంచో వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. మొదటి నుంచి కూడా స్థానికుల వ్యాపారాలలో మార్వాడీలు వేలు పెట్టకూడదని నిబంధన ఉన్నది. అయితే అమనగల్లు ప్రాంతంలో మార్వాడీలు ఈ నిబంధన అతిక్రమించారు. దీంతో స్థానిక వ్యాపారులలో ఆగ్రహం కలిగింది.. దీంతో వారు మార్వాడీలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మొదలుపెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఇందులోకి కొన్ని శక్తులు ప్రవేశించాయి. అది కాస్త రాజకీయ రంగు పులుముకుంది.

ఇది కాస్త తెలంగాణలో అశాంతిని, అభద్రతను కలగజేస్తుందని ఇంటలిజెన్స్ ద్వారా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది.అమన గల్లు ప్రాంతంలో ఉన్న స్థానిక వ్యాపారులు, మార్వాడీలతో సమావేశం నిర్వహించింది. ఇద్దరి మధ్య సయోధ్య కుదిరించింది. తద్వారా సమస్య పరిష్కారమైంది.ఈ సమస్య ఇక్కడితోనే ఆగి పోయేది కాదని.. ఇంకా చాలా దూరం వెళుతుందని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను ముగిసిపోయింది అనుకోవద్దని.. దీని మూలాలను కనుగొని పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.. సమస్య ప్రస్తుతం తాత్కాలికంగా పరిష్కారం మాత్రమే అయిందని.. ఇంకా అనేక రకాల రూపాలలో ఈ సమస్య తెలంగాణ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ వైపే.. మొగ్గు...

**గుంటూరు,తెలంగాణ దిశ:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోకపోయినా పరోక్షంగా తన సంబంధాలను కొనసాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెడుతున్న ప్రతి బిల్లుకు వైసీపీ ఆమోదిస్తుంది. అలాగే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ మద్దతు ఇస్తూ వస్తుంది. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా జగన్ బీజేపీతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వానికి కూడా జగన్ పట్ల సానుకూల వైఖరి ఉందంటారు. మరొకవైపు కాంగ్రెస్ కు శత్రువు కావడంతో సహజంగానే తనకు మిత్రుడిగా జగన్ ను బీజేపీ భావిస్తుంది. అందుకే జగన్ పై నమోదయిన అనేక కేసులు నేటికీ ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ నేతలు కూడా బహిరంగంగానే ఆరోపిస్తారు. తాజాగా మరోసారి ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఇండి కూటమి ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. నామినేషన్లకు తుది గడువు కావడంతో ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దింపాలని ప్రయత్నిస్తుంది. అయితే వైసీపీకి రాజ్యసభలో ఏడుగురు, లోక్ సభలో నలుగురు సభ్యుల బలం ఉంది. మొత్తం పదకొండు మంది సభ్యులు ఉండటంతో జగన్ సహజంగానే ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఇప్పటికే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఫోన్ చేసి జగన్ తో మాట్లాడారు. తమకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. తాను పార్టీ నేతలతో చర్చించిన తర్వాత నిర్ణయం చెబుతానని జగన్ చెప్పినప్పటికీ నిర్ణయం బీజేపీ వైపు ఉంటుందన్నది అందరికీ తెలిసిందే. రాహుల్ పై విమర్శలు జగన్ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా విమర్శలు చేశారు. చంద్రబాబు, రాహుల్ గాంధీ హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారంటూ ఆరోపించారు. అలాగే ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ జగన్ పై చేసిన విమర్శలతో పాటు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కూడా జగన్ కు శత్రువుగా మారడంతో ఆ పార్టీ పక్షాన నిలబడే అవకాశం ఎంత మాత్రం ఉండదు. అందుకే అందులోనూ ఎన్డీఏకు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గెలవగల బలం కూడా ఉంది. ఛాన్స్ లేదన్నది ఓపెన్ సీక్రెట్. కాకుంటే పార్టీ నేతల అభిప్రాయం తీసుకుని ప్రకటిస్తామని చెప్పడం మాత్రం కేవలం నామమాత్రమేనని అందరికీ తెలిసిందే. 2014కు ముందు పార్టీ పెట్టిన తర్వాత బీజేపీ నాయకత్వం నేరుగా జగన్ తో పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నించిందన్న ప్రచారం అప్పట్లో బాగానే జరిగింది. అయితే జగన్ ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసీపీ పార్టీ పెట్టడంతో పాటు త ననుపదహారునెలల పాటు జైలులో ఉంచారన్న కసి ఆయనలో ఇప్ప టికీ ఉంది. అందుకే జగన్ నిర్ణయం బీజేపీకే అనుకూలంగా ఉండ నుంది. ఏపీ రాజకీయాలను పరిశీలించిన వారికి ఎవరికైనాజగన్ బీజేపీకిమిత్రుడేనని చెబుతారు. రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ జగన్ మాత్రం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశమయితే అసాధ్యమన్నది వాస్తవం. అందువల్ల బీజేపీకి జగన్ ఇప్పుడే కాదు.. ఎప్పటికీ మిత్రుడేనని ఖచ్చితంగా చెప్పాలి.

# వందరోజులు షూటింగ్‌లో పాల్గొననున్న దీపికా పదుకొనే..


దీపికా పదుకొనే..

అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబోలో వస్తున్న ఈ మూవీ వస్తున్న మూవీలో బాలీవుడ్ నటి దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటిస్తున్నది. ఈ మూవీకి వర్కింగ్ టైటిల్ పేరు పెట్టారు. ఈ మూవీ దీపికా పదుకొనే ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి మొదలు కానున్నట్లు పింక్‌విల్లా నివేదిక తెలిపింది. విశేషం ఏంటంటే దీపికా వంద రోజుల పాటు రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొననున్నది. ఈ మూవీలో దీపిక ఓ యోధురాలి పాత్రను పోషించనున్నట్లు సమాచారం. లుక్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నివేదిక తెలిపింది. ఇంతకుముందున్నడూ చూడని సరికొత్త అవతారంలో దీపికను ప్రేక్షకులు తెరపై చూడనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మూవీలో యాక్షన్, భావోద్వేగ, నాటకీయ సన్నివేశాలు ఉండనున్నట్లు తెలుస్తున్నది. ఈ మూవీలో అల్లు అర్జున్ మూడు పాత్రలు పోషించనున్నాడు. ప్రతిపాత్రకు డిఫరెంట్ లుక్‌లో ఉంటుందని సమాచారం.ఈ మూవీ టైం ట్రావెల్‌లో ఉంటుందని.. హాలీవుడ్ ఇంటర్ స్టెల్లార్ మూవీస్ తరహాలో ఉండనున్నట్లు సమాచారం. ప్రపంచాన్ని కాపాడడం కోసం, శాంతి ని కల్పించే మిషన్‌పై బన్నీ పని చేస్తాడని.. అందుకోసమే కాలంలో ప్రయాణించి విపత్తులను అడ్డుకుంటారని.. డైమెన్షన్ ట్రావెలర్‌గా అభిమానులను అలరించనున్న ట్లుగా ఫిల్మ్ ఇండస్ట్రీలో వార్త చక్కర్లు కొడుతున్నది. సినిమాలో రెడ్ అండ్ బ్లూ పేరుతో అనే రెండు ప్రపంచాలను అట్లీ చూపించబోతున్నట్లుగా సమాచారం. ఈ ప్రాజెక్టు విషయంలో బన్నీ సీరియస్‌గా ఉన్నాడని.. ఇతర కమిట్‌మెంట్స్‌ని పక్కనపెట్టి కేవలం దృష్టిసారించాడు. అల్లు అర్జున్ పుష్ప-2 : ది రూల్ మూవీతో బాక్సాఫీస్ వద్ద బంపర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. ఈ మూవీ ఏకంగా రూ.1800కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది.బాక్స్ ఆఫీస్ వద్ద హైయెస్ట్‌గ్రాస్ వసూలు చేసిన చిత్రాల్లో రెండో భారతీయ సినిమాగా ఘనత సాధించింది. 2021 లో వచ్చిన పుష్ప చిత్రంతో అల్లు అర్జున్ ఏకంగా బెస్ట్ యాక్టర్ కేటగిరిలో జాతీయ ఉత్తమ నటుడు అవార్డును సైతం అందుకున్న విషయం తెలిసిందే. బన్నీ, అట్లీ మూవీ ఈ సినిమా నిర్మాణం సెప్టెంబర్ 2026 వరకు కొనసాగనున్నది. 2027 ద్వితీయార్థంలో పెద్ద ఎత్తున విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. మరోవైపు అవెంజర్స్, ఐరన్ మ్యాన్, స్పైడర్ మ్యాన్, ఆక్వా మెన్ వంటి చిత్రాలకు వీఎఫ్ఎక్స్ అందించిన హాలీవుడ్ టాప్ టెక్నీషియన్లు ఈ చిత్రానికి పని చేయబోతున్నారు. దాదాపు రూ.800కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించనున్నట్లు తెలుస్తున్నది. ఇక ఈ మూవీలో అల్లు అర్జున్, దీపికా పదుకొనేతో పాటు రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ తదితర నటీనటులు కీలకపాత్రలో నటించనున్నట్లు సమాచారం. అయితే, దీపికా పదుకొనే ప్రస్తుతం ఇండస్ట్రీలో బిజీగా ఉన్నది. ఈ ఏడాది అక్టోబర్‌లో షారుఖ్ ఖాన్‌తో కలిసి 'కింగ్' మూవీ షూటింగ్‌లో పాల్గొననున్నది...

# సినిమా..

## సున్నా నుండి స్టార్ వరకు...





సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఎన్నో వీడియోల్లో ముంబయికి చెందిన వర్ష సోలంకి డ్యాన్స్ వీడియోలు కూడా ఉంటాయి. ఆ వీడియోలన్నీ ఔరా అనేలా ఉంటాయి. ఎంతో ప్రతిభ ఉన్న కళాకారిణిలా ఆమె వేసే స్టెప్పులకు తన ఫాలోవర్స్ లైక్‌ల మీద లైక్‌ల కొడుతుంటారు. అయితే వర్ష శిక్షణ పొందిన కళాకారిణి కాదు.. ఒక బిడ్డకి తల్లి. చిన్న వయసులో తను అనుభవించిన పేదరికం ఆమెని ఇంటి పనిమనిషిగా మార్చింది. తాగుడికి అలవాటు పడిన బాధ్యతలేని తండ్రి వల్ల అమ్మకు సాయంగా ఇల్లిళ్లు తిరిగి పనిచేసింది. ఇన్ని కష్టాలు అనుభవిస్తున్న వర్షకి డ్యాన్స్ చేయాలన్న కోరిక బలంగా ఉండేది. అయినా అది తన బాల్యం, యవ్వనంలో తీరే దారి కనిపించలేదు. భవిష్యత్తులో తీరుతుం దన్న ఆశా లేదు. అయితే.. వర్ష మాత్రం తన కోరికని అలా వదల్లేదు. సోషల్‌మీడియాని వేదికగా చేసుకుంది. తనకి వచ్చిన స్టెప్పులతో డ్యాన్స్ చేసి అప్‌లోడ్ చేసింది. మొదట్లో ఎన్నో అవమానాలు వచ్చాయి. భరించింది. ట్రోల్ చేశారు. సహించింది. ఎప్పుడైతే తన స్టోరీని ఇన్‌స్టాలో పోస్టు చేసిందో అప్పుడే ఆమె స్ఫూర్తివంత ప్రయాణం జనాలకి తెలిసింది. పనిమనిషి నుండి ఆమె ఎదిగిన తీరుని వైరల్ చేశారు. ఓ డ్యాన్స్ షోలో ప్రదర్శన ఇచ్చేంతగా ఆ డ్యాన్స్ వీడియోలు వైరల్ అయ్యాయి. బాలీవుడ్ దిగ్గజ నటుల సమక్షంలో 'డ్యాన్స్ దివానే' డ్యాన్స్ షోలో ఆమె చేసిన ప్రదర్శన చూసి జడ్జిలు అబ్బురపడ్డారు. ఆ తరువాత తన కథ తెలిసి గుండెలకి హత్తుకున్నారు. ఇది ఒక అమ్మ సాధించిన విజయం. పనిమనిషిగా మొదలైన వర్ష ప్రయాణం డ్యాన్సర్‌గా ఆమెని నిలబెట్టింది. 'ఇది జీవితం నాకిచ్చిన రెండో అవకాశం. ఈ స్థాయికి వస్తానని నేను కలగనలేదు. నేనెంతో ఇష్టపడ్డ డ్యాన్స్ నన్ను ఇంతమంది హృదయాలు గెలుచుకునేలా చేసింది' అని ల వర్ష ఒకింత భావోద్వేగంగా ఆడ్యాన్స్ షోలో మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని స్తాయి. 'నువ్వు నిజమైన హీరోవి. ప్రజలు నీ నుండి ఎంతో నేర్చుకోవాలి. ఎన్నికష్టాలు వచ్చినా నువ్వు ధైర్యంగా నిలబడ్డావు' అని వర్షని ఉద్దేశించి జడ్జిలు చేసిన వ్యాఖ్యలు కూడా వాస్తవం. సున్నా నుండి ప్రారంభమైన వర్ష జీవితం ఇప్పుడు తనని ఓ స్టార్‌ని చేసింది. ఇన్‌స్టాలో 68 లక్షల ఫాలోవర్లతో ప్రముఖుల స్థానంలో నిలిచేలా చేసింది.

# 'మసూద'లో... భయపెట్టింది ఈ బ్యూటీనే!


బాంధవి శ్రీధర్

'మసూద' సినిమా 2022లో థియేటర్లకు వచ్చింది. ఈ సినిమాను చూసినవారు, అంత తొందరగా మరిచిపోలేరు. అందుకు కారణం .. ఆ సినిమా కంటెంట్ .. ఆ సినిమా టేకింగ్ అనే చెప్పాలి. ఆ తరువాత చెప్పుకోవలసింది, ఆ సినిమాలో దెయ్యం పట్టినట్టుగా నటించిన బాంధవి శ్రీధర్ గురించి. ఆ సినిమాలో ముద్దుగా .. బొద్దుగా కనిపిస్తూనే ఈ అమ్మాయి భయపెట్టేస్తుంది. ఈ అమ్మాయి ఎవరో మంచి ఆర్టిస్ట్ అవుతుందని అంతా అనుకున్నారు కూడా. అలాంటి బాంధవి శ్రీధర్ ఇప్పుడు కాస్త స్లిమ్ అయింది. యూత్ ఆశ్చర్యపడేలా కాస్త నాజూకుగా తయారైంది. ఆ సినిమాలో అంతగా భయపెట్టిన ఆ అమ్మాయేనా, ఇప్పుడు ఇలా కుర్రాళ్లకు కుదురు లేకుండా చేస్తుందని అనిపిస్తుంది. ఈ మధ్య బాంధవి సోషల్ .మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటోంది. చీరకట్టులోను .. మోడ్రన్ డ్రెస్ లలోను వరుస ఫొటో షూట్ లతో తన జోరు చూపిస్తోంది. రీసెంట్ గా ఆమె పోస్ట్ చేసిన పిక్స్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ట్రెండీ లుక్ తో కూడిన ఈ పిక్స్ లో ఆమె మరింత అందంగా ఉందంటూ కామెంట్స్ పడుతున్నాయి. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చేయమని కుర్రాళ్లు ఎంకరేజ్ చేస్తున్నారు. అయితే నిజంగానే బాంధవి త్వరలో హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనుందనే టాక్ కాస్త బలంగానే వినిపిస్తోంది. ప్రస్తుతం రెండు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయని అంటున్నారు. హీరోయిన్ గా ఆమె ఎంట్రీ ఇచ్చే సమయం ఎంతో దూరంలో లేదని చెబుతున్నారు....

# సదా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ



సదా పేరు చెబితే చాలామందికి 'జయం' సినిమాలో ఆమె చెబుతున్న "వెళ్ళవయ్యా వెళ్ళు" అనే డైలాగ్ వెంటనే గుర్తొస్తుంది. ఆ సినిమా ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ, తన టాలెంట్‌తో అతి తక్కువ సమయంలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు, లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అపరిచితుడు'లో అవకాశం దక్కించుకుంది. దీంతో సౌత్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయినా, ఆమె కెరీర్ ఊహించినంత ముందుకు సాగలేదు.



'అపరిచితుడు' తర్వాత సదా సరైన స్క్రిప్ట్‌లు ఎంచుకోలేకపోయింది. వరుస ఫ్లాపులతో ఆమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. సినిమాలు ఆశించిన స్థాయి చేరకపోవడంతో పాటు, కొన్ని గోల్డెన్ ఆఫర్స్‌ను వదులుకోవడం కూడా ఆమె కెరీర్‌కు ఎదురుదెబ్బ అయ్యింది. చంద్రముఖి సినిమాలో మొదటగా జ్యోతిక పాత్రకు సదాకే అవకాశం వచ్చింది. కానీ 'అపరిచితుడు' షూటింగ్ కారణంగా డేట్స్ కుదరక, ఆ అవకాశాన్ని కోల్పోయింది. శేఖర్ కమ్ముల 'ఆనంద్' చిత్రం కోసం కూడా మొదట గా సదానే అని అనుకున్నారు. కానీ ఆమె ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించడం తో మరో హీరోయిన్‌కి ఆ అవకాశం దక్కింది. ఇలా సదా అప్పుడు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో తన కెరీర్ సందిగ్ధంలో పడ్డట్టు అయింది. అయితే సిల్వర్ స్ర్కీన్ దూరమైనా, సదా బుల్లితెరపై కొన్నాళ్లు తన హవా కొనసాగించింది. 'ఢీ', 'నీతోనే డాన్స్' వంటి డ్యాన్స్ షోలు జడ్జిగా హాజరై మళ్లీ పాపులారిటీ తెచ్చుకుంది. అయితే ఇటీవలి కాలంలో సినిమా, టీవీ రెండినీ కూడా పక్కనపెట్టి సదా పూర్తిగా కొత్త దిశగా అడుగులు వేసింది. సదా ఇప్పుడు కెమెరా ముందుకు కాకుండా కెమెరా వెనకకు వెళ్లింది! ఆమె ప్రస్తుతం వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై పూర్తిగా ఫోకస్ పెట్టింది. అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి, అడవుల్లో జంతువుల వీడియోలు చిత్రీకరించి షేర్ చేస్తోంది.ఇటీవల ఆమె తన నికాన్ కెమెరాతో ఆఫ్రికా అడవుల్లో ఓ లోమిన జాతికి చెందిన సింహాన్ని చిత్రీకరించింది. ఆ సింహం స్లోమోషన్‌లో నడుస్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని చూసినవారంతా సదా ఫోటోగ్రఫీ టాలెంట్‌కి ఫిదా అయ్యారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215